



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే ఆనందరావు

అన్నవరంలో వైకుంఠ ద్వారం వద్ద అలంకరణ



ముస్తాబైన వాడపల్లి ఆలయం

నేడు ఉత్తరద్వార దర్శనం

4లో

- ఆలయాల్లో పుష్పాలంకరణ
- భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు
- వాడపల్లికి ప్రత్యేక శోభ

ఎస్.యానాం బీచ్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

కట్టుకాల్వపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదన

ఉప్పలగుప్తం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమీక్ష నిర్వహించారు. గురువారం బీచ్‌లో పర్యటించిన కలెక్టర్ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరారు. పనుల జరుగుతున్న తీరును డీఈఈ కలెక్టర్‌కు వివరించారు. బీచ్‌ను ఆనుకుని ఉన్న కట్టుకాల్వపై శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో మరో వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈ రాజ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గ్రామం నుంచి బీచ్‌కు ప్రస్తుతం ఉన్న రహదారితో పాటు మరో రహదారి ఆవశ్యకతను ఎమ్మెల్యే ఆనందరావు కలెక్టర్‌కు వివరించారు. లైట్‌హౌస్ మీదుగా బీచ్ నుంచి గ్రామానికి మరో రహదారి ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు డీఈఈ తెలిపారు. సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు పలచోళ్ల పద్మనాభం, అయితాబత్తుల రాజశేఖర్, పలచోళ్ల బుజ్జి, అయితాబత్తుల అజయ్‌సింగ్, పినిశెట్టి నరసింహారావు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ల నారాయణరావు, సత్తి చిన్నా, పలచోళ్ల గోపి, చీకట్ల శ్రీను, మాగాపు శ్రీను, లంకే శ్రీను, కోటిపల్లి రాజు పాల్గొన్నారు.

పండగ బాదుడే..



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సమీపించడంతో టిక్కెట్ ధరలు షాక్ కొడుతున్నాయి. సామాన్యుడికి అందకుండా ఆకాశాన్నంటుతున్నాయి. పండగకు ఇంటికి రావాలనుకునేవారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అధికంగా హైదరాబాద్ నుంచి వస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ రెట్టింపు ధరలు పిండేస్తుండగా రైళ్లలో ఒక్క సీటు లేని పరిస్థితి. పోనీ విమానంలో వద్దామనుకుంటే అవి కూడా ఫుల్ అయిపోయాయి. డిమాండ్ పెరగడంతో ఇండిగో కంపెనీ చార్జీలను భారీగా పెంచేసింది. పండగ రద్దీ పేరుతో సాధారణ రోజుల్లో ఉండే విమాన చార్జీ ధర రూ.3,299 కాస్తా ఇప్పుడు ఏకంగా రూ.15,850కి పెరిగిపోయింది.ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఇండిగో రోజుకు ఆరు సర్వీసులు నడుపుతోంది. శుక్రవారం నాటికి ఐదు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా, ఒకే ఒక విమానంలో అరకొరగా సీటున్నాయి. అయితే వీటి చార్జీ ధర ఏకంగా రూ.15,086గా ఉంది. ఒకరకంగా ఐదు రేట్లు పెరిగిపోయి చార్జీలు షాక్ కొడుతున్నాయి. శనివారం అయితే నాలుగు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా రెండింటిలో మాత్రమే కొద్దిగా సీట్లున్నాయి. అయితే చార్జీలు రూ.14,486 చొప్పున కంపెనీ వసూలు చేస్తోంది. ఈనెల 12న అయితే టికెట్ ధరలు రూ.15,850 చొప్పున ఇండిగో వసూలు చేస్తోంది. 13న అంటే భోగి రోజున కాస్త డిమాండ్ తక్కువగా ఉండడంతో రూ.11,650 వరకు చార్జీలు ఉన్నాయి. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ హైదరాబాద్ నుంచి కాకినాడకు రోజుకు మూడు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపుతోంది. వీటిలోనూ సీట్లన్నీ నిండిపోయి వెయిటింగ్ లిస్ట్ 290 వరకు ఉంది. మరికొన్నింటిలో ఏకంగా రిగ్రేట్ చూపుతోంది. వీటిలో సీట్ల లభ్యత ఈనెల 14 నుంచి మాత్రమే ఉన్నాయి. పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ ప్రయాణం అయ్యేవారికి ఇప్పటినుంచే

రోజుకు రూ.1.65 కోట్ల దోపిడీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో కాకినాడ నుంచి 40 ప్రైవేట్ బస్సులు, అమలాపురం రాజోలు నుంచి 50 ప్రైవేట్ బస్సులు, రాజమహేంద్రవరం నుంచి 60 ప్రైవేట్ బస్సులు వెరసి 150 ప్రైవేట్ బస్సులు హైదరాబాద్, బెంగుళూరు పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కొక్క బస్సులోనూ సుమారు 50 నుంచి 55 మంది 8,250 మంది చొప్పున ప్రయాణిస్తుంటారు. పండుగ పేరిట స్పెషల్ ధరలతో ప్రయాణికుల నుంచి ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు సుమారు రూ. 1.65 కోట్ల మేర ప్రతి రోజూ అదనపు వసూళ్లు చేస్తూ దారుణ దోపిడీకి గురిచేస్తున్నారు. అయినా ప్రభుత్వం కళ్లు తెరవకపోవడం గమనార్హం.

పెద్ద పండుగకు వద్దామంటే.. ప్రైవేటు దోపిడీ

విమాన చార్జీలు షాక్ కొడుతున్నాయి. ఈనెల 15న రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమాన చార్జీ సమయం బట్టి రూ.10,384 నుంచి రూ.14,887 వరకు ఎగబాకాయి. 16న ఏకంగా రూ.16,394 వరకు చార్జీలు పెరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే ఈనెల 19 వరకు తిరుగు ప్రయాణానికి సంబంధించి బాదుడే బాదుడు అన్నట్టు కొనసాగుతోంది.

- రైళ్లన్నీ రిగ్రేట్.. బస్సులన్నీ ఫుల్
- పండుగంతా ప్రైవేట్ స్పెషల్‌దే
- బస్సు టిక్కెట్ల ధరకు రెక్కలు
- రెట్టింపు ధరల వసూళ్లు
- సీటు అయితే రూ.2 వేలు
- బెర్త్ రూ.3 వేలు
- రద్దీ పేరిట భారీ వసూళ్లు
- ఆకాశంలో విమాన చార్జీలు
- మూడు రెట్లు పెరిగిన వైనం
- ఆర్టీసీ బస్సులకు భారీ డిమాండ్

ఆర్టీసీ ఏం చేస్తుందో..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్రాంతి బస్సు సర్వీసులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రజల నుంచి ఈ డిమాండ్ ఎక్కువగా వినబడుతోంది. ఇప్పటికే జిల్లా ఆర్టీసీ ప్రీ-సంక్రాంతి ఆపరేషన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోల నుంచి 88 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే ఈ స్పెషల్ సర్వీసుల్లో టిక్కెట్లన్నీ గతంలోనే హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. వీటితోపాటు షెడ్యూల్ సర్వీసుల్లోనూ టిక్కెట్లు లేవు. దీంతో హైదరాబాద్ నుంచి మరిన్ని బస్సులు నడపాలనే డిమాండ్ వస్తున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్థిరపడిన వారు పెద్ద పండక్కి సొంతూర్లకు తరలివస్తారు. ఆర్టీసీ సర్వీసుల్లో సాధారణ బస్సు చార్జీలను మాత్రమే వసూలు చేస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఆర్టీసీ మాత్రం హైదరాబాద్ నుంచి జిల్లాకు మరిన్ని స్పెషల్ సర్వీసులు నడిపేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు కనబడుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా భారీగా ఆదాయం పొందే అవకాశం ఉన్నా ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారులు ఇప్పటివరకూ అదనపు స్పెషల్స్‌పై ఎలాంటి ప్రకటనా చేయలేదు.

పండుగ పూట.. ప్రైవేట!

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో సంక్రాంతి. రైళ్లన్నీ ఫుల్ కావడంతో హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, చెన్నై ప్రాంతాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, కాకినాడ, రంగంపేట, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, అటు కోనసీమ ప్రాంతాలకు వచ్చేందుకు ప్రైవేట్ ఏజన్సీల వద్దకు జనం పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆపరేటర్లు టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారు. ఆన్‌లైన్‌లో భారీ ధరలకు టిక్కెట్ల విక్రయాలకు పోటీపడుతున్నారు. సంక్రాంతి పండుగను సొంతూళ్లో జరుపుకోవడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల కల. దీనిని ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లు ఫుల్ కావడంతో ప్రయాణికులకు ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ప్రైవేట్ బస్సుల టిక్కెట్ల ధరలను పెంచేశారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు రూ.890-900 మధ్య టిక్కెట్ ధరలను వసూలు చేస్తారు. బెంగుళూరు నుంచి రూ.1,500 నుంచి రూ.1,800 మధ్య వసూలు చేస్తారు. ప్రస్తుత ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో హైదరాబాద్ నుంచి సామర్లకోటకు సీటు ఒక్కింటికి రూ.1,880 వసూలు చేస్తున్నారు. ఇదే బెర్తులైతే రూ.2300-2600 చొప్పున వసూలు చేస్తున్నారు. చెన్నై, ముంబై వంటి ప్రాంతాల నుంచి టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అప్పర్, లోయర్ బెర్త్ అంటూ వేరు చేసి డిమాండ్‌ను బట్టి రూ.1,880 నుంచి రూ.3 వేల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు పిండేస్తున్నారు.

నేటి నుంచి ప్రైవేటు బస్సుల తనిఖీలు : డీటీవో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ హెచ్చరించారు. వాహనాలకు సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా జప్తు చేస్తామని స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం డీటీవో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ప్రైవేట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా తనిఖీలకు రవాణా అధికారులతో కూడిన స్పెషల్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో ప్రయాణికుల లగేజీ బ్యాగులు మాత్రమే ఉండాలని, వాణిజ్యపరమైన వస్తువులను తరలించకూడదన్నారు. ప్రయాణికులు సురక్షితంగా తీసుకురావాలని కోరారు.

తెలుగు వెలగాలి

ముగిసిన తెలుగు మహాసభలు





రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లకు సన్మానం చేస్తున్న జీజీయూ కులపతి చైతన్య రాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మాడుగుల నాగఫణిశర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు

తెలుగు వెలగాలి.. తెలుగును బతికించుకుందాం.. తెలుగును కాపాడుకుందాం.. తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడదాం.. ఇంగ్లీషు వద్దు.. తెలుగేరా ముద్దు.. ప్రతి ఒక్కరి నోటా ఇదే మాట.. అందుకు ఏమైనా చేస్తామని.. ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామని నాయకులు ప్రతినబూనారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీయూలో చివరి రోజు గురువారం ప్రపంచ తెలుగు మహాసభ అట్టహాసంగా సాగింది. దీనిలో భాగంగా పలువురు ప్రముఖులు తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా అంటూ పిలుపునిచ్చారు.. తెలుగు ప్రాముఖ్యత నలుదిశలా వినిపించేలా చాటారు. 'తల్లిదండ్రుల్లో మార్పురావాలని.. తమ పిల్లలను తెలుగులోనే చదివించాలని .. కూటమి ప్రభుత్వం తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడుతుందని' కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.. 'సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కింద స్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని' మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. 'మధురమైన, అద్భుత భాష తెలుగును భావితరాలకు అందించాలని.. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషల్లో తెలుగు 15వ స్థానంలో ఉండగా, మన దేశంలోని భాషల్లో తెలుగుకు నాల్గవ స్థానం ఉందని' బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు.. జీయూ చైర్మన్ చైతన్యరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది తెలుగు సంక్రాంతి పండుగను నిర్వహిస్తానన్నారు. కాగా తెలుగు మహాసభల్లో భాగంగా అచ్చతెలుగులో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అబ్బురపరిచాయి..

4



తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా.. అంటూ చిన్నారి ప్రదర్శన..

రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలి

- బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు నిర్మిస్తున్న సంబంధిత ఏజెన్సీలు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడంపై ప్రైవేటు ఏజెన్సీతో ఆడిట్ నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాలు నివారించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రోడ్డు భద్రతా ప్రమాణాలపై ఆడిట్ నిర్వహించి 20 రోజులలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై సైన్ బోర్డులు తక్షణం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన జంక్షన్లలో ప్రమాదాలు జరగకుండా అనుభవం ఉన్న ట్రాన్స్‌పోర్టు ఇంజనీర్లతో సర్వే నిర్వహించి ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈతకోట నుంచి పి.గన్నవరం వరకు బ్యాంకు కెనాల్ రోడ్డు మీద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత రహదారులపై క్రాష్ బ్యారియర్స్‌ను నిర్మించే అంశాన్ని పరిశీలించాలన్నారు. జిల్లాలో కాల్వలు, డ్రెయిన్ల పక్కన ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు ఎన్ని ఉన్నాయో నివేదిక ఇస్తే వాటిని ఆర్అండ్‌బీ కార్యదర్శుల కమిటీ సంబంధిత రోడ్లపై రహదారి భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కావాల్సిన నిధులను మంజూరు చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరుకుగా ఉన్న ఈదరపల్లి బ్రిడ్జి, అమలాపురం డంపింగ్ యార్డు సమీపంలోని బ్రిడ్జి, నల్లవంతెన, ఎర్రవంతెనలను విస్తరించేందుకు లేదా ప్రత్యామ్నాయంగా వంతెనలు నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి సాయిల్ ఎనాలసిస్ చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్పీబీ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రాము, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కె.కార్తీక్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠినచర్యలు

- ప్రభల తీర్థాలు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు
- కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. ఎక్కడా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ, పోలీసు అధికారులతో సంక్రాంతిని పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోడిపందేల నిర్వహణను అడ్డుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. గేమింగ్ చట్టం-1974, జంతు హింస నివారణా చట్టం-1960 ప్రకారం పందెపు రాయుళ్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందాల నిర్వహణను అడ్డుకునేందుకు జిల్లా, మండల స్థాయిల్లో రెవెన్యూ, పోలీసు, పశుసంవర్ధకశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డింగు డ్యాన్సులు ఎక్కడైనా నిర్వహిస్తే ఆయా ప్రైవేటు స్థలాలను జప్తు చేసే విధంగా రెవెన్యూ చట్టాల ప్రకారం అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని కోడి పందాలు నిర్వహిస్తారన్న ముందస్తు సమాచారం ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేసేలా ఆర్డీవోలు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సంప్రదాయ పద్ధతుల్లో సంక్రాంతిని నిర్వహించుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.

ప్రభల తీర్థాలకు ప్రత్యేక ఏర్పాట్లు..

సంక్రాంతి సందర్భంగా కోనసీమ జిల్లాలో జరిగే ప్రభల తీర్థాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా జగ్గన్నతోట, అంబాజీపేట, శివకోడు తదితర ప్రాంతాల్లో జరిగే ప్రభల తీర్థాల ప్రాంతాల్లో జనం రద్దీ ఎక్కువగా ఉంటుందని, అటువంటి ప్రాంతాల్లో తొక్కిసలాటలు జరగకుండా సంబంధిత మేనేజ్‌మెంట్ కమిటీలు చర్యలు తీసుకునే విధంగా ఆర్డీవోలు సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ, ఏపీఈపీడీసీఎల్, అగ్నిమాపక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో కూడిన మండల స్థాయి బృందాలను నియమించి సంబంధిత ప్రభల తీర్థాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకునే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని జేసీ టి.నిషాంతిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ గతంలో కోడి పందాలు నిర్వహిస్తూ పట్టుబడిన సుమారు 785 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. కోడిపందాలు నిర్వహించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జేసీ నిషాంతితో పాటు అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రముఖ కవి అందెశ్రీని సత్కరిస్తున్న ప్రముఖులు


నటి హేమను సత్కరిస్తున్న ప్రముఖులు


బీజేపీ నేత సోము వీర్రాజుకు సత్కారం



తేనెలొలుకు.. తెలుగు

పులకించిన తెలుగు తల్లి

- తరలివచ్చిన భాషాభిమానులు
- వివిధ ప్రాంతాల యాసలతో ప్రతిధ్వనించిన జీజీయూ
- అలరించిన చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు
- అతిథులకు పురస్కారాలు...సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం, వేర్వేరు ప్రాంతాల యాసలతో తెలుగు తల్లి పులకించింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మాతృభాషను కీర్తిస్తూ పలువురు రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితల ప్రసంగాలతో తెలుగు తల్లి ఉప్పొంగి పోయింది. తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ భాషాభిమానులంతా తన్మయత్వంలో మునిగితేలారు. జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన రాజరాజ నరేంద్ర వేదికపై ప్రారంభమైన రెండో రోజు వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సభాధ్యక్షత వహించగా, ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు శంఖారావం పూరించి సభలను ప్రారంభించారు. పలువురు రాజకీయ సాహితీ ప్రముఖులు, అవధానులు, కవులు, రచయితలు, కళాకారులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వెలుగెత్తి చాటారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగు మహాసభలను పురస్కరించుకుని జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలువురు కవులు, రచయిత్రుల విగ్రహాలను చూస్తుంటే తెలుగుదనం ఉట్టిపడుతుందన్నారు. ఇటువంటి సభలను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువచేసి మరుగున పడుతున్న మాతృభాషను, సంస్కృతిని పరిరక్షించాలని చైతన్యరాజుకు సూచించారు. అమెరికాలో పుట్టిన పిల్లలు సైతం తెలుగులో మాట్లాడుతున్నారని, తెలుగు భాష పరిరక్షణ ఒక ఉద్యమం మాదిరిగా గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి మరింత పటిష్టం చేయాలన్నారు.

తెలుగు భాష, సంస్కృతికి.. పుట్టినిల్లు

గోదావరి ప్రాంతం తెలుగు భాష, సంస్కృతికి పుట్టినిల్లు వంటిదని మరో కవి నడింపల్లి కృష్ణ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. తెలుగు భాష మానవతా విలువలను నేర్పుతుందని, దానిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాష జీవితాన్నిస్తుందని, ఆస్ట్రేలియాలో తెలుగు కోసం, తెలుగు వారి కోసం తెలుగు బడులు ప్రారంభించామన్నారు. ఆస్ట్రేలియాలో తెలుగు భాషను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. రానున్న ఏడాదిలో ఆస్ట్రేలియాలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించ తలపెట్టామని, దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా చైతన్యరాజును కోరారు.

ఒదుగుదల భాష తెలుగు

కవి గరిమెళ్ల వరప్రసాద్

కవి గరిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ఒదుగుదల కలిగిన భాషగా చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, నెల్లూరు ప్రాంతాలకు ఒక యాస ఉంటుందంటూ ఆయా ప్రాంతాల యాసలతో తిరుపతి వెంకటకవుల రచించిన పద్యాలను ఆలపించారు. తెలుగు భాష కొంత నేర్చుకుంటే చాలు పద్యాలను అలవోకగా రాయవచ్చంటూ కవితలు, రచనలతో తెలుగు భాష తియ్యదనాన్ని చాటిచెప్పారు. మరో ముఖ్యఅతిథి, భారతీయ కవి, గేయరచయిత అందెశ్రీ మాట్లాడుతూ తెలుగు భాషకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో మరే భాషను నేర్చుకోలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మనుషుల్లో మానవత్వం కొరవడుతుందని, మాయమైపోతున్నాడమ్మా..మనిషన్నవాడు అనే పాటను ఆలపిస్తూ అందరి హృదయాలను కదిలించారు. సిలికాన్ ఆంధ్ర మన బడి వ్యవస్థాపకుడు చామర్తి రాజు మాట్లాడుతూ తెలుగు భాష మృత భాష కాదని, అమృత భాష అని అభివర్ణించారు. తెలుగు భాష కోసం తాను చేస్తున్న ఉద్యమంలో భాష నేర్పేందుకు సిలికాన్ ఆంధ్ర సిద్ధంగా ఉందన్నారు. తెలుగు భాష వైభవాన్ని జీజీయూ ప్రాంగణంలో కూడా కొనసాగించాలని చైతన్యరాజు కోరారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రపంచ తెలుగు మహాసభలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన పలు శాస్త్రీయ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



అతిథులకు సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహా సభలను పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులను జీజీయూ కులపతి చైతన్యరాజు సారధ్యంలో పలువురు మంత్రులు సమక్షంలో ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులను, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అలాగే చామర్తి రాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కవి గరిమెళ్ల వరప్రసాద్, వసుదా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంక దినకర్, అందె శ్రీను, గోపీమూర్తిలను ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, ప్రోఛాన్సలర్ శశికిరణ్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, జీజీయూ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష ఎంతో మధురం

లంక దినకర్

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ మాతృభాషలో ఉన్న మాధుర్యం మరే భాషలోనూ లేదన్నారు. శ్రీకృష్ణదేవరాయలు మన ప్రాంతానికి విచ్చేసి సేదదీరిన సమయంలో ఆలపించిన పద్యాలను మరో మారు గుర్తు చేస్తూ ఆలపించారు. ఈ జగత్తులో తెలుగు భాష ఉన్నంత కాలం దిగ్విజయంగా ఉండాలని, ప్రధాని నరేంద్ర మోదీ మాతృభాషపై దృష్టిసారిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు భాషను చాటిచెప్పాలన్నారు.

అమ్మను మర్చిపోయినట్టే..

ఎమ్మెల్యే బత్తుల

తెలుగు భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్లే అవుతుందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చైతన్యరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తెలుగు మధురంగా ఉంటుందన్నారు.

తెలుగింటి అమ్మాయిని కావడంతోనే నాకీ ఆదరణ

నటి హేమ

మీరందరూ నన్ను ఇంతగా అభిమానించడానికి కారణం నేను గోదావరి జిల్లా అమ్మాయిని.. రాజోలు అమ్మాయిని.. తెలుగు అమ్మాయిని. 500 లకు పైగా సినిమాల్లో నటించానంటే అందుకు ప్రధాన కారణం నా తెలుగు భాష. మా అమ్మ, నాన్న ఆకారాన్నిస్తే నా వెటకారంతో ఆర్టిస్టును కాగలిగాను.. లక్షలాది మంది అభిమానుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించగలిగానన్నారు.నన్ను ఆదరించడానికి కారణం తెలుగు భాష అన్నారు. మా అమ్మ, తమ్ముడు అందరూ గోదావరి జిల్లా రాజోలులోనే ఉంటున్నారు అందుకే ప్రతి ఏడాది సంక్రాంతికి ఇక్కడికే వస్తా.. నా గోదావరి జిల్లా అంటే చాలా ఇష్టం. ఇక్కడ పుట్టడం నా అదృష్టంగా భావిస్తా. నన్ను గోదావరిలో ఈత కొట్టించడం మా నాన్నకు ఇష్టం. నాన్న కోసం గోదావరిలో సగం ఈత కొట్టాను. మధ్యలోనే చదువు ఎగ్గొట్టి సినీ ఇండస్ట్రీకి వెళ్లిపోయాను. నాకు చదువు రాకపోయినా నన్ను ఆదరించి, అభిమానించింది మాత్రం తెలుగు భాష వల్లే అని గర్వంగా చెప్పుకుంటానన్నారు. ముస్లిం ఇళ్లలో ఖురాన్ ఉంటుంది. క్రైస్తవులు ఇళ్లలో బైబిలు ఉంటుంది. ప్రతి హిందువు ఇళ్లలో భగవద్గీత ఖచ్చితంగా ఉండి తీరాలన్నారు. చివరిగా గోదావరి యాసలో నమస్తే అండీ, బాగున్నారండీ, ఎప్పుడొచ్చారూ, భోంచేసి వెల్లండే అంటూ అందరినీ కడుపుబ్బ నవ్వించి ముగించారు.


అన్నవరంలో పుష్పాలంకరణతో ఏర్పాటుచేసిన తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం

నేడు సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం

- పుష్పాలంకరణలో ఆలయం ముస్తాబు
- తిరుపతి సంఘటన నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామి,అమ్మవార్లు ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీనికి సంబంధించి ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. ఉత్తరద్వారాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబుచేయించారు. తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం మాదిరి ఏర్పాటుచేశారు. ప్రధానాలయంలో మూలవరులను, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషపాన్పుపై పవళించే శ్రీమహావిష్ణువుగా సత్యదేవుడిని, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న లక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించి ఏకకాలంలో మూలవరులు, ప్రత్యేక అలంకరణలోఉన్న ఉత్సవమూర్తులను భక్తులు దర్శించేవిధంగా ఏర్పా టుచేశారు. ఉదయం 5గంటలనుంచి సా య ంత్రం 5గంటల వరకు భక్తులకు ఉత్తరద్వారం లో సత్యదేవుడిని దర్శించుకునే అవకాశం కల్పించారు. సుమారు 50వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనావేస్తూ దానికనుగుణంగా అధికారులు ఏర్పాట్లుచేశారు. భక్తులకు కదంబప్రసాదాన్ని అందించనున్నారు.

దేవస్థానంలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

- భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలి
- ఆర్థిక పరిస్థితి బాగాలేనందున వృథాఖర్చులు తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో పనిచేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయడంతో పాటుగా భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలని ఈవో సుబ్బారావు సూచించారు. గురువారం సాయంత్రం దేవస్థానంలో అన్ని విభాగాలలో ఉద్యోగులందరితో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ వోపీ ఆదేశాలను వివరించారు. దేవస్థానంలో ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, వృ థా ఖర్చులు తగ్గించాలని సూచించారు. సిబ్బ ంది తరుపున వచ్చేవారికి ప్రత్యేక దర్శన టిక్కె ట్లు కనీసం సగమైనా తీయించాలని తద్వారా కొంత ఆదాయం పొందవచ్చునని సూచించా రు. ప్రసాదం విభాగంలో పనిచేసే సూపరింటెండెంట్‌కు అదనపు విభాగం అప్పగించకూడదని తద్వారా పూర్తి పర్యవేక్షణతో పనిచేస్తారని అన్నారు, ఆ లయాలకు వి చ్చేసే భక్తులకు దర్శనం, వ్రతక్యూలైన్‌లు పటిష్టంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించి గుర్తింపుకార్డు ధరించాలన్నారు. భక్తుడు కొండదిగువ నుంచి కొండపైకి వచ్చేవరకు తనకు కావలసిన సౌకర్యాలు ఎక్కడ లభిస్తాయో తెలిసేవిధంగా ఎక్కడికక్కడ సైన్‌బోర్డులు ఏర్పా టుచేయాలన్నారు. సమావేశంలో ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలైన్లు పరిశీలన : తిరుపతి సంఘటన నేపథ్యంలో అన్నవరం దేవస్థానంలో క్యూలైన్లను ఈవో సుబ్బారావు పరిశీలించారు. క్యూలైన్‌లు పటిష్టంగా ఉండాలని భక్తులను ఒక్కసారిగా వదలకుండా నిరంతరం క్యూలైన్‌ద్వారా భక్తుల నడకసాగేలా చూడాలని సూచించారు.

ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

- 50వేలు పైబడి భక్తులు వస్తారని అంచనా
- త్వరితగతిన దర్శనాలు జరిగేలా అధికారుల సమాయత్తం



పుష్పాలంకరణలో వాడపల్లి వెంకన్న ఆలయం, ముక్కోటి సప్త ద్వారాలు

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులకు సకాలంలో స్వామి దర్శనం అందించేలా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. వైకుంఠ ద్వారం వద్ద సప్తద్వారాలను ఫలపుష్పాలతో అలంకరిస్తున్నారు. వసంత మండపం ముఖమండపం, అంతరాలయం, ప్రకార మండపాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు. భక్తులు వెళ్లే ద్వారాలవద్ద సుంగధ పరిమళాలు వెదజల్లే పుష్పాలను అలంకరిస్తున్నారు. శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు ఉత్తర ద్వారం వద్ద కొలువుతీరి భక్తులను కటాక్షించనున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి తిరుప్పావై సేవ అనంతరం భక్తులకు ప్రముఖులకు దర్శనాలను అందించనున్నారు. ఉదయాన్నే గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి వరకు భక్తులకు వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. 50వేలు పైబడి భక్తులు రానున్నట్లు అంచ నావేసి ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఏర్పాట్లపై రాష్ట్ర కమిషనర్ సూచనలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర దేవదాయ కమిషనర్ సత్యనారాయణ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన సంఘటనపై కమిషనర్ గురువారం 13 జిల్లాలోని ఈవోలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి తోపులాటలు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు బిస్కట్లు, పాలు, ప్రసాదం పంపిణీ చేయడంతోపాటు త్వరితగతిన దర్శనాలు జరిగేలా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అందించాల్సిన సౌకర్యాలను, దర్శనాలను త్వరితగతిన అందించాలని తగుసూచనలు అందించారు. ఎస్ఐ ఎస్.రాము, తహశీల్దారు రాజేశ్వరరావులు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ

తిరుమల ఘటన నేపథ్యంలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం రాత్రి జిల్లా ఎస్పీ కృష్ణారావు సందర్శించారు. వెంకన్న ఆలయానికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో చేపట్టే ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. బారీకేడ్లు, క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను పరిశీలించి ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన సమీక్షించారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టనున్నారు. ఈయన వెంట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.


ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు


వాడపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు


వాడపల్లి వెంకన్న ఆలయంలో ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

వాడపల్లిలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లపై జిల్లా అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు గురువారం ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులను ఆదేశించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం సిద్ధం

మామిడికుదురు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్నిపురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మామిడి కుదురు మండలం అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారు శుక్రవారం వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం ఇస్తారు. వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని దేవస్థానాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటుప్ల చేసినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.


అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో పూలతో అలంకరించిన ధ్వజస్తంభం

వైభవంగా భద్రగిరి రాములోరి తెప్పోత్సవం





బోట్‌లో ఆశీనులైన స్వామివారు, గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్‌పురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) రెండో భద్రగిరిగా పేరుగాంచిన వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి కొండపైఉన్న శ్రీసుందర సీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం స్వామివారిని ఆలయం నుంచి పురవీధుల గుండా హంసవాహనంపై ఆశీనులనుగావించి పవిత్ర గోదావరిలో అర్చకుడు పురుషోత్తమాచార్యులు స్వామివారిని బోట్‌పై ఆశీనులను చేసి తెప్పోత్సవం నిర్వహించారు. రాములోరి తెప్పోత్సవాని తిలకించేందుకు మండలంలోని వీఆర్ పురం, వడ్డిగూడెం, రేఖపల్లి, సీతంపేట రాజుపేట తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, టీరక సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

హెచ్ఎంపీవీ వైరస్..
భయాందోళన వద్దు

- శీతాకాలంలో కాలనుగుణ వ్యాధి
- అవగాహనతోనే ఆరోగ్య రక్షణ
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే చాలు
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు



కరోనా వైరస్.. ఈ పేరు వింటేనే ప్రజలు ప్రాణభయంతో గజగజవణికిపోయేవారు. ఈ వైరస్ బారిన పడి చాలామంది మరణించారు. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి శకం ముగిసింది. కానీ చైనా నుంచి మరో ప్రాణాంతక వైరస్ ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఈ వైరస్ పేరు హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్ఎంపీవీ). ఇది కర్నాటక రాష్ట్రంలో తొలిసారిగా రెండు కేసులు నమోదైనట్లు నిర్ధారణ కావడం పట్ల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వైరస్ రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్, ఫ్లూ వంటి వ్యాధులతో సోకుతుంది.

జీజీహెచ్(కాకినాడ), జనవరి9(ఆంధ్రజ్యోతి): భారత్‌లో తొలిసారిగా కర్నాటక రాష్ట్రంలో ఈ వైరస్ బాధిత కేసు నమోదైంది. బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 3నెలల చిన్నారిలో హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు గుర్తించారు. 2వ కేసు కూడా జనవరి 3న కర్నాటకలో బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 8నెలల బాలుడిని గుర్తించి వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. ఈ వైరస్‌పై ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీఎంఆర్‌ని అలర్ట్ చేసింది. సాధారణంగా శీతాకాలంలో సంభవించే కాలానుగుణ వ్యాధిఇది. ఈవైరస్‌పై భయాందోళనలకు గురికానవసరం లేదని, అవగాహనతో ఆరోగ్యంగా ఉండవచ్చని రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ ఎం.రాఘవేందరావు తెలిపారు. ఈ వైరస్ నివారణపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఇదొక సాధారణ ఫ్లూ

శీతాకాలంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్ఎంపీవీ) సోకుతుంది. ఇది ఒక సాధారణ ఫ్లూ.. జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా చిన్నారులు, పెద్దలకు సోకుతుంది. దగ్గు తగ్గకపోవడంతోపాటు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. చైనాలో కేసులు పెరగడంతో కొవిడ్ నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇది కొవిడ్-19 ఫ్లూ. ఇతర శ్వాస కోశ రుగ్మతలను పోలి ఉంటుంది. జ్వరం రావడం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. ఇన్‌ఫెక్షన్ సోకిన 3 నుంచి 6 రోజుల్లోగా ఈ లక్షణాలు బయటపడతాయి. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం చూపుతుంది.

ఇలా వ్యాపిస్తుంది..



ఈ వైరస్ తుమ్ములు, దగ్గువల్ల వెలువడే తుంపర్ల నుంచి ఇతరులకు సోకుతుంది. వైరస్ బారిన పడిన వారికి దగ్గర, సన్నిహితంగా ఉన్నవారికి సోకుతుంది. బాధితులను తాకడం, ఆ చేతులతో ముక్కు, కళ్లు, నోటిని తాకినప్పుడు ఈ వైరస్ సోకే అవకాశాలు ఉన్నాయి.

నివారణకు తీసుకోవాల్సిన చర్యలు



ఈ వైరస్ ప్రమాదకారి కాదు. చలికాలంలో చిన్నారులు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిని ఇబ్బందులకు గురిచేస్తుంది. కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వైరస్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. చేతులను తరచూ సబ్బుతో కనీసం 20సెకన్లపాటు శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. చేతులను శుభ్రం చేసుకోకుండా నోరు, ముక్కు, కళ్లను తాకరాదు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ లు ధరించాలి. వైరస్ బారిన పడితే బయట తిరగరాదు. ఇలా బయట సంచరించడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సోకే అవకాశాలు ఉన్నాయి.

భయాందోళన చెందాల్సిన పనిలేదు

హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్ఎంపీవీ) ఇది సాధారణ ఫ్లూ. శీతాకాలంలో అందరిలో జలుబు, దగ్గు తదితర ఫ్లూ లక్షణాలు ఉంటాయి. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులకు ఈ ఫ్లూ సోకుతుంది. కొవిడ్‌తో పోల్చుకుంటే ఇది ప్రమాదకరం కాదు. బ్రాంకైటిస్, నిమోనియాతో బాధపడుతున్న వారిని ఈ వైరస్ ఇబ్బంది పెడుతుంది. స్వీయ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. జీజీహెచ్, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఫ్లూ నివారణకు పలు రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

-డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు,
రిటైర్డు డీఎంఈ, కాకినాడ



కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు





సాయంకాలం సెలవంటూ..!

సాయం సంధ్య వేళ.. సెలవంటూ చీకట్లోకి జారుకుంటూ.. కాకినాడ-సామర్లకోట మధ్య సూర్యాస్తమయం సమయంలో సూర్యుడు ఇలా చిక్కాడు

-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఎంఎస్‌వో పేరిట ఎండీయూ ఆపరేటర్ అక్రమ వసూళ్లు

ఆపరేటర్లకు సెల్‌లో వాయిస్ మెసేజీలు వైరల్

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఎంఎస్‌వోగా పనిచేస్తున్న అధికారికి మండలంలో ఎండీయూ ఆపరేటర్లు ఒక్కొక్కరూ రూ.200 చొప్పున ఇవ్వాలని మండల రేషన్ ఎండీయూ ఆపరేటర్ల సంఘ ప్రతినిధి, ఇటీవల కాలంవరకూ వైసీపీ నాయకులతో అంటకాగిన వ్యక్తి వాయిస్ మెసేజీ పంపడం వైరల్‌గా మారింది. ఈ మేరకు సదరు వాయిస్ మెసేజీని పలువురి విలేకర్లకు గురువారం ఫార్వార్డ్ చేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కార్యాలయం నిర్వహణకోసం ఎండీయూ ఆపరేటర్లకు రూ.200 చొప్పున ఫోన్‌పే ద్వారా తన నెంబరుకు పంపాలని, ఆ డబ్బులకు సంబంధించి స్ర్కీన్ షాట్‌ను తన ఫోన్‌నెంబరుకు పంపాలని వాయిస్ మెసేజీల ద్వారా తెలిపారు. దీన్ని ఎండీయూ ఆపరేటర్లకు మాత్రమే కాకుండా రేషన్ డీలర్లకు సైతం పంపినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరు ఎండీయూ ఆపరేటర్‌గా వ్యవహరించిన ఇతను అప్పుడు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను స్వయంగా పాల్గొని రేషన్ డీలర్లను బాధ్యులను చేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగి ఏడునెలలు పైబడినా నేటికీ ఇతని వైఖరిపై తమకు తలనొప్పిగా తయారైందని రెవెన్యూ అధికారులు వాపోతున్నారు. దీనిపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి వాస్తవ సమాచారాన్ని సేకరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు తెలిసింది.

ఉత్సాహభరితంగా 'ఆదిత్య' కలర్స్ యూత్ ఫెస్ట్ ప్రారంభం

గండేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్-25 యువజనోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొదటిరోజు ఉదయం 9.30గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జేఎన్టీయూకే రెక్టార్ డాక్టర్ కేవీ రమణారావు, గౌరవఅతిథిగా ఐక్యద్రా ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ ఫౌండర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.

విద్యార్థులతో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్, జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డాన్స్ వంటి వినోదభరిత వాతావరణంతో ఆదిత్య క్యాంపస్ అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు వివిధ రకాల ఫ్యాషన్ డిజైన్‌లతో కూడిన వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఆదిత్య కలర్స్ ఏర్పాటు చేశామన్నారు. సినీ ప్రముఖుల సందడి, లేజర్ షో, విద్యార్థుల ఆటపాటలు ఈ కలర్స్‌లో చోటు చేసుకున్నాయన్నారు. 50వేలమందికి తగ్గకుండా ఏర్పాట్లు చేసి అన్నీ సమకూర్చామన్నారు. స్పోర్ట్స్, గేమ్స్ సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనడానికి వివిధ కళాశాలల నుంచి 2వేలమంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారని, 67 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. మొదటిరోజు హీరో నిఖిల్ రాగా, రెండోరోజు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మూడోరోజు హీరో కిరణ్ అబ్బవరం రానున్నట్లు తెలిపారు.

మా కాలేజీలో కలర్స్ లేవు

-హీరో నిఖిల్ సిద్ధార్థ్



నిఖిల్‌ను సన్మానిస్తున్న ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి

కలర్స్-25 యువజనోత్సవాల్లో హీరో నిఖిల్ సిద్ధార్థ్ జోష్ పెంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను చూస్తుంటే ఎంతో ఆనందంగాను, ఈర్ష్యగాను ఉందన్నారు. తాను చదువుకున్న ఇంజనీరింగ్ కళాశాలలో ఇటువంటి కలర్స్ లేవన్నారు. చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. తదనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. హ్యాపీడేస్ నుంచి ఇప్పటివరకు 23 సినిమాలు చేశానని, 'ఆదిత్య'లో కిర్రాక్ పార్టీ సినిమా తీశామని యాజమాన్యానికి ఎంతో రుణపడి ఉంటానని తెలిపారు. కిర్రాక్‌పార్టీ సినిమాకు ఆదిత్య వైస్‌చైర్మన్ సతీష్ రెడ్డి ఎంతో సహకరించారన్నారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాల నిర్వహణపై ఆర్డీవో సమీక్ష



ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

అంబాజీపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి కనుమ సందర్భంగా ఈనెల 15న నిర్వహించే అంబాజీపేటమండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని సంప్రదాయంగా ప్రశాంతంగా నిర్వహిద్దామని కొత్తపేట ఆర్డీవో పి. శ్రీకర్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ కార్యాలయంవద్ద తహశీల్దారు జె.వెంకటేశ్వరి అధ్యక్షతన ఏకా దశ రుద్రులు ఉత్సవ కమిటీ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభల తీర్థంలో మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని సూచించారు. ఆర్డీవో మాట్లాడుతూ తీర్థంలో సౌకర్యాలు ఏర్పాటు చేసేలా అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య పనులు, జంగిల్ క్లియరన్స్‌తోపాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. జిల్లా దేవదాయశాఖాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో జీవీ సరోవర్, వైద్యాధికారి ఇంద్రావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, కాంఢ్రేగుల శ్రీనివాసరావు, నాయకులు దాసరి సత్యనారాయణ, దంతులూరి శ్రీనివాసరాజు,వాసుదేవానందస్వామీజీ, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, నూకపెయ్యి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో పరిశీలన



తెప్పోత్సవానికి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

అంతర్వేది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం శ్రీలక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లను ఆర్డీవో కె.మాధవి గురువారం పరిశీలించారు. ముందుగా స్వామి కల్యాణ మండప ప్రదేశం, రథం రోడ్డు, ఆర్టీసీ బస్సులు ప్రవేశ స్థలం, చక్రస్నానం, వసంత మండపం, స్వామివారి తెప్పోత్సవం జరగడానికి కొత్తగా తవ్వుతున్న చెరువు పనులను పరిశీలించి ఆలయ అధికారులతో మాట్లాడారు. తదుపరి సమీక్షా సమావేశానికి ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో జరగాలని, సముద్ర స్నానాలకు వెళ్లే రోడ్డు, వసంత మండపానికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్, పార్కింగ్, ట్రాఫిక్, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులతో సమీక్షిస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఆలయ అధికారులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, సీఐ పి.నరేశ్‌కుమార్, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, రాజోలు డిస్ట్రిబ్యూటరీ నీటి సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఈవోపీఆర్డీ ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అచ్యుతరామారావు



అచ్యుతరామారావును అభినందిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోళ్ల అచ్యుతరామారావు(శివజ్యోతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం సూర్య హోటల్‌లో గురువారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా శ్రీనుబాబు(కాకినాడ శ్రీలక్ష్మీ టాకీస్), కోశాధికారిగా రాంబాబు(మండపేట సత్యశ్రీ), ఉపాధ్యక్షులుగా చినబాబు(పిఠాపురం సత్య థియేటర్), సదాశివరావు(ద్రాక్షారామ), సంయుక్త కార్యదర్శిగా నాని(లక్కవరం వేణుగోపాల్ థియేటర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అనుశ్రీ సత్యనారాయణ, సురేష్ మూవీస్ లక్ష్మణరావు, గీతా ఫిలిమ్స్ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి సినిమాస్ అంజి, గౌరీ శంకర్, సత్తిరెడ్డి, హరిబాబు, జగ్గంపేట శివ, సూరపరాజు, సత్యకుమార్ తదితర ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

చలిమంటకు పూరిల్లు దగ్ధం

- వృద్ధుడి సజీవ దహనం
- తుని పట్టణంలో ఘటన

తునిరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో పూరిల్లు దగ్ధమై వృద్ధుడు సజీవ దహనమైన ఘటన సంచలనం రేకెత్తించింది. తుని పట్టణం రామకృష్ణ కాలనీలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న తాతపూడి చిన్నయ్య (64) బుధవారం చలి మంట వేసుకుని నిద్రిస్తున్నాడు. ఈ సమయంలో పూరిల్లు అంటుకుని మంటలు చెలరేగాయి. ఆ వృద్ధుడు ఇంట్లోనే ఉండిపోవడంతో మంటలు ఎగిసిపడి బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోయింది. దీంతో కేకలు వేసినప్పటికీ అర్ధరాత్రి కావడంవల్ల స్థానికులు ఎవరూ సకాలంలో కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ వృద్ధుడు అప్పటికే మంటల్లో సజీవ దహనమయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఇటీవల భార్యతోపాటు కుమారుడు మరణించాడు. అప్పటినుంచి కూతుళ్ల సంరక్షణలో ఈ పూరింట్లోనే తలదాచుకుంటున్నాడు. ఘటనా స్థలాన్ని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదంలో సజీవ దహనమైన వృద్ధుడు

24కిలోల గంజాయి స్వాధీనం

- కోటనందూరు సమీపంలో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- కారు స్వాధీనం



కోటనందూరులో గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కోటనందూరు,జనవరి 9(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం-తుని రహదారిపై కోటనందూరు సమీపంలో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతం నుంచి ఓ కారులో తరలిస్తున్న 24.3కిలోల గంజాయిని బాపట్ల జిల్లా రామాలయానికి చెందిన మరుప్రోలు నాగేంద్రరెడ్డి, కందాల చిరంజీవి తీసుకువెళ్తుండగా కోటనందూరువద్ద పట్టుకున్నామని సీఐ చెన్నకేశవరావుతెలిపారు.దీనివిలువ రూ.48వేలు ఉంటుందన్నారు. తహశీల్దార్ సుభాష్ సమక్షంలో ఇద్దరిని అరెస్టుచేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

- ఐషర్ వ్యాన్‌లోకి దూరిన బైక్
- మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు



పిండ్రాల చిన్నయ్య(ఫైల్)

కొత్తపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో గురువారం ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొక మోటార్‌సైకిలిస్టు తీవ్రంగా గాయపడినట్లు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి పలివెల గ్రామానికి చెందిన పిండ్రాల చిన్నయ్య(31) చికెన్ దుకాణం సమీపంలో కొబ్బరికాయలతో రోడ్డు దాటుతుండగా అమలాపురంవైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు దాటుతున్న చిన్నయ్యను ఢీకొట్టి అతడిపై నుంచి వెళ్లి పోయింది. దీంతోపాటు రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడ్ని ఢీకొట్టగా అతడు వాహనంతోపాటు రోడ్డు అవతలి వైపున నిలిచి ఉన్న ఐషర్ వ్యానులోకి దూరిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో పిండ్రాల చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందగా మోటార్‌సైకిలిస్టు కొత్తపేట మండల పరిధి కొత్తపాలేనికి చెందిన కొప్పిశెట్టి వెంకరమణకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈ ఘటనపై మృతుని తండ్రి పిండ్రాల పెదపెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.



సంఘటనాస్థలంలో చిన్నయ్య మృతదేహం

ఉమ్మడి జిల్లాలో నాటు సారా నియంత్రించాలి

ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్‌శర్మ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాటుసారాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కట్టడి చేయాలని, మద్యంషాపులు, బార్లలో జరిగే నేరాలను నియంతించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చైతన్యమురళి, కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రేణుకా, తూర్పుగోదావరి అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రగ్గుకు సిగరెట్టు అంటుకుని తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):కొత్తపేట శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నివసిస్తున్న పిల్లి సత్యనారాయణ(68) అనే వ్యక్తి బుధవారం మంచెంపై పడుకుని సిగరెట్టు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ రగ్గుకు అంటుకుని కాలిపోయింది. దీంతో అతడిని కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. అతడి కుమారుడు పిల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సువర్ణరాజు తెలిపారు.

గోదావరి కాలువలో దూకి వ్యక్తి గల్లంతు

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గేట్ సమీపాన గోదావరి కాలువపై నిర్మించి వంతెన రక్షణగోడ నుంచి దూకి ఓ లోకల్ పత్రిక జర్నలిస్టు గురువారం రాత్రి గల్లంతయ్యాడు. సంఘటనా సమాచారం తెలిసిన వెంటనే సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సంఘటనా స్థలికి చేరుకుని అతడి ఆచూకీకోసం ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాకినాడ జిల్లా పెదపూడికి చెందిన సలీం అనే వ్యక్తి స్థానిక నిఘా పత్రిక జర్నలిస్టు. అతడు గురువారం ఓ మహిళతో కలిసి మోటార్‌సైకిల్‌పై సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్తున్నాడు. రైల్వేగేట్ సమీపించే సరికి గోదావరి కాలువ పక్కన మోటార్‌సైకిల్ నిలుపుదల చేసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని ఆమెకు చెప్పి వంతెనపై నుంచి కాలువలోకి దూకేసినట్లు భావిస్తున్నారు. అటుగా వెళ్తున్న రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలిలో ఉన్న మహిళనుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

నలుగురికి జైలుశిక్ష

కపిలేశ్వరపురం,జనవరి9(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నలుగురికి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక్కొక్కరికీ మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు అంగర ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాలప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి సూర్యకుమారి ఇంట్లో లేనప్పుడు బంగారం వెండిఆభరణాలు చోరీచేశారు. దీనిపై బాధితురాలు సూర్యకుమారి 2023, జూలై 17న అంగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ జి.చంటి కేసు నమోదు చేశారు. వాదోపవాదాల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితులు కాజులూరుకు చెందిన షేక్ అజీజ్, రాజమహేంద్రవరానికి చెందిన యడ్లఉషాసూర్యవెంకట రాకేష్, తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ, ఇంద్రపాలేనికి చెందిన ముషినాడ గౌరీ మల్లేశ్వరిలకు జైలు శిక్ష విధించారు.

విజేతలకు బహుమతులు

మలికిపురం,జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో జరిగిన పోటీల్లో కబడ్డీ విన్నర్‌గా ఇరుసుమండ జడ్పీ హైస్కూలు, రన్నర్స్‌గా బట్టేలంక హైస్కూల్, ఖోఖోవిన్నర్స్‌గా బట్టేలంక హైస్కూల్, రన్నర్స్‌గా రామరాజులంకహైస్కూల్ నిలిచాయి. బట్టేలంక జడ్పీ హైస్కూల్‌లో విజేతలకు బహుమతులను ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఇచ్చారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ నంబరు-1 ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం అన్నపూర్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగిపండ్లు, ఆటల పోటీలు జరిగాయి.

అమిత్‌షాపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

● అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసనలు

ముమ్మిడివరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో లోక్‌సభలో రాజ్యాంగంపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మంత్రి అమిత్‌షా అవమానించడం రాజ్యాంగ ఉల్లంఘన చర్యగా భావించి తక్షణం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలోని జైబుద్ధ పార్కులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన పార్టీ సమావేశంలో వక్తలు మాట్లాడారు. పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేయాలని, అమిత్‌షాపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహం పాదాల వద్ద ఉంచారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పి.రవివర్మకు వినతిపత్రం అందించారు. దీనిపై కమిషనర్ రాష్ట్రపతికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలెపు ధర్మారావు, దివి వెంకటేశ్వరరావు, మల్లాడి గోపి, గోడి భాస్కరరావు, పెయ్యల చంటిబాబు, కాశి అచ్యుతరామయ్య, మెండి కొండబాబు, మెండి రాజశేఖర్, మెల్లం శ్రీరాములు పాల్గొన్నారు.



మామిడికుదురు: నగరంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచిన జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

అమిత్‌షా రాజీనామా చేయాలి

మామిడికుదురు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షాను మంత్రి పదవి నుంచి కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని తీర్మానం చేస్తూ లెటర్‌ను అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉంచారు. తర్వాత తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయిన ఘటనలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఆరీఫ్, మాచవరపు శివన్నారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, చిట్టాల రామజోగేశ్వరరావు, నీతిపూడి బాలసత్యనారాయణ, నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్/రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ ఏటా నూతనత్వంతో ముందుకు సాగాలని చెప్పేదే సంక్రాంతి పండుగ పర్వదినాల పరమార్థమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. నాలుగు రోజుల ముందుగానే సంక్రాంతి ఎలా ఉండబోతుందో తెలియచెప్పిన విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో అంబరన్నాంటే విధంగా గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు తోట రవితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు కళ్లకు కట్టినట్టుగా సంక్రాంతి పండుగ విశిష్టతను వివరిస్తూ వేడుకలు జరిపారు. విద్యార్థులు ఎడ్ల బండ్లపై ఊరేగారు. కోనసీమకు ప్రత్యేకమైన ప్రభల ఊరేగింపులో డీఈవో సలీంబాషాతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సర్ సీవీ రామన్ పాఠశాలలో ప్రభల ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, కర్రి సత్యనారాయణమూర్తి, నల్లా పవన్‌కుమార్, అరిగెల బలరామమూర్తి, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, సహస్ర ప్రిన్సిపాల్ గౌసియాబేగం పాల్గొన్నారు.



అమలాపురం: భాష్యం పాఠశాలలో సంప్రదాయ సంక్రాంతి వేషధారణల్లో విద్యార్థులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఉప్పలగుప్తం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భట్నపాలెం ఏవీఎస్ఎన్ జూనియర్ కళాశాల, అమృత ఇంగ్లీషు మీడియం విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో భోగి మంటలు, ఎడ్లబండ్ల ఊరేగింపు, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ అడపా గోపి, హెచ్ఎం నల్లా సరస్వతీదేవి, కవి నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు. గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో సంక్రాంతి ఆచార సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎంలు లంకరాణి, నూకల సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్లు వాలా సత్యనారాయణ, గుర్లింక చిన్నా, కూటమి నాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మంచెం బాబి పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

పి.గన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్లో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, స్కూలు చైర్మన్ నల్లా దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి పాటలతో ప్రభను ఊరేగించి అనంతరం రంగవల్లులు వేశారు. అనంతరం భోగిమంట వేశారు. నరేంద్రపురం ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో విద్యా సంస్థల అధినేత ఆర్.గోపినాథ్, డైరెక్టర్ ఆర్.పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు, ప్రభలు ఊరేగింపు, రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడిపందాలు, కొమ్మదాసర వేషధారణ, హరిదాసు, సోదెమ్మ వేషధారణలతో విద్యార్థినీ విద్యార్థులు అలరించారు.

విద్యార్థుల కర్రసాము

అంబాజీపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సాంస్కృతి సంప్రదాయాలతో పండగను ఆనందంగా నిర్వహించుకోవాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కర్రసాము, రంగవల్లులు, భోగిమంటలు ఆకట్టుకున్నాయి. గంగలకుర్రు అగ్రహారం సాయిరవితేజ ప్రైమరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తయారుచేసిన ప్రభ ఆకట్టుకుంది.

మలికిపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కత్తిమండ యూపీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హరిదాసు, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు, బొమ్మల కొలువులు, రంగవల్లులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ చిట్టాల శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ చిట్టాల శివాజీ, ప్రధానోపాధ్యాయుడు అడబాల గంగయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న బొమ్మలకొలువు

రాజోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ నంబరు-1 ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గురువారం పాఠశాలల్లో విద్యార్థులతో బొమ్మలకొలువు, రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగిపండ్లు, ఆటల పోటీలు జరిగాయి. కార్యక్రమాల్లో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కోలాటాలు

అంతర్వేది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శృంగవరప్పాడు, అంతర్వేది తదితర హైస్కూళ్లలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలు కోలాటాలు భజనలుచేసి భోగిమంటలు వేశారు. శృంగవరప్పాడు, పడమటిపాలెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా 72 రకాల వంటకాలు తయారుచేసి పెద్ద విస్తరలో వడ్డించారు. ఎంఈవోలు ఎం.వెంకటేశ్వరరావు, డి.కిశోర్ కుమార్‌లు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలి: కలెక్టర్

అమలాపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తాచాటి జాతీయస్థాయి ప్రదర్శనలకు ఎంపికైన ప్రాజెక్టు రూపకర్తలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభచాటి కోనసీమ ఖ్యాతిని ఇనుమడింప చేయాలన్నారు. ఊబలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నికిల్‌కుమార్‌రెడ్డి, గైడ్ టీచర్ ఇ.నాగలక్ష్మి ఆధ్వర్యంలో రూపొందించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. నీటి రక్షణకు వినూత్న విధానాలను ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిపాదించడంతో భవిష్యత్తు తరాలకు నీటిని అందించడం, నీటి పొదుపు విశిష్టతను వివరించిందని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోరపల్లి సత్యవర్ధన, పరమట రోహిణి రూపొందించిన మల్టీపర్పస్ యుటిలైజేషన్ మిషన్ ప్రాజెక్టు జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. వనరులను సమగ్రంగా వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఏవిధంగా దోహదపడుతుందో ప్రాజెక్టు ద్వారా వివరించారు. తొండవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గైడ్ టీచర్ కేసీహెచ్ఎల్వీ నరసింహారావు, వేస్ట్ టూ వెల్త్ ప్రాజెక్టును రూపొందించగా జాతీయస్థాయికి ఎంపికైంది. ఇక గోడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి కె.శాల్విన రూపొందించిన మేజికల్ అంబ్రెల్లా ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆయా పాఠశాలల విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సమక్షంలో కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టీర హనుమంతరావు, ఏఎంవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన ప్రాజెక్టు రూపకర్తలైన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

బెల్టుషాపులు, ప్రజా సమస్యలపై సభ్యుల ఆగ్రహం

వాడివేడిగా మండల సమావేశం

అల్లవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనధికార మద్యం బెల్టుషాపులు, తీర్మానాలు లేకుండా రోడ్ల నిర్మాణాలు, జగనన్న లేఅవుట్లలో అక్రమాలు వంటి వివిధ సమస్యలపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశం వాడివేడిగా సాగింది. గూడాల, దేవగుప్తంతో పాటు పలు గ్రామాల్లో ఊరికి పది మద్యం బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు దాకరపు చిరంజీవిరావు, సాధనాల వెంకట్రావుతో పాటు పలువురు ధ్వజమెత్తారు. డి.రావులపాలెంలో గతంలో ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థలాల్లో అవకతవకలు జరిగాయని, నిరుపేదలకు కాకుండా ఇళ్లు ఉన్న వారికే ఇళ్ల స్థలాలు ఇచ్చారని సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్ ధ్వజమెత్తారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు న్యాయం చేయాలన్నారు. గడపగడపకు నిధులు రాలేదని ఎంపీటీసీ ఎన్.మౌనికవరలక్ష్మి ఆరోపించగా, ప్రభుత్వం మారాక గడపగడపకు నిధులు ఆపేశారని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అన్నారు. తాడికోన, గూడాల ఆర్అండ్‌బీ రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయని, దేవగుప్తం సచివాలయం వద్ద టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు లేవనెత్తారు. మొగళ్లమూరు నుంచి రెబ్బనపల్లి రోడ్డు అధ్వానంగా తయారైందని సర్పంచ్ రాయుడు విష్ణుత్రిమూర్తులు ఆరోపించారు. తీర్మానాలు లేకుండా గ్రామాల్లో రోడ్లు పెడుతున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.11.8లక్షలతో గోడిపాలెం స్కూలు అభివృద్ధి చేస్తామని పీఆర్ఏఈ సయ్యద్ ఫకీర్ తెలిపారు. మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ దృష్టికి తీసుకువెళుతున్నట్టు తహశీల్దార్ ఎంవీవీ నరసింహం వివరించారు. ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి అన్నారు. వయసు దాటిన 180మందికి వితంతు, వృద్ధాప్య పింఛన్లు ఆగిపోయాయని ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. దాళ్వాకు సక్రమంగా సాగునీరు అందించాలని సర్పంచ్‌లు కోరారు. ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ వడ్డి గంగతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అల్లవరం మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు

పబ్లిక్ పరీక్షల పట్ల ఆందోళన వద్దు



అప్పన్నపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన జేసీ నిషాంతి

అమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు పెట్టుకోరాదని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం అలవరచుకోవాలన్నారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాందోళనలు విడనాడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కామనగరువు అప్పన్నపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, జనుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జేసీ పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కృషి, పట్టుదలతో విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సనాతన పండుగలన్నీ వైజ్ఞానికమే

అమలాపురంటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సనాతన కాలంగా జరుపుకుంటున్న పండుగలన్నీ వైజ్ఞానికమేనని శృంగవృక్షం దత్త పీఠాధిపతులు శ్రీసాయిదత్త నాగానందసరస్వతీస్వామిజీ పేర్కొన్నారు. డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో గురువారం సూర్యనగర్‌లో కోనసీమ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సరస్వతీ స్వామిజీ సంస్కృతి సంప్రదాయాల్లో ముడిపడి ఉన్న వైజ్ఞానిక అంశాలను వివరించారు. ధర్మ పరిరక్షణ కోసం కృషిచేస్తున్న వివేకానంద సేవా సమితి కార్యదర్శి జి.నాగరాజు,భజరంగ్‌దళ్ నాయకులు శిరంగు నాయుడు, నవ్యసంగీత అకాడమీ డైరెక్టర్ మట్టపర్తి చంద్రశేఖర్, కరాటం ప్రవీణ్‌లను స్వామిజీ ఆధ్వర్యంలో సత్కరించారు. రంగవల్లికల పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముషిణి రామకృష్ణారావు, మట్టపర్తి నాగేంద్ర పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుకు భూమిపూజ

అంతర్వేది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంక గ్రామంలో ఓఎన్జీసీ ఎన్టీటీ ఈసీ నిధులతో ఓటరు ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం భూమిపూజ చేశారు. రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు లేకుండా చూస్తానన్నారు. రామేశ్వరం, అంతర్వేదిపాలెంతో పాటు అంతర్వేది దేవస్థానంలో కూడా నూతన మంచినీటి చెరువు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాజోలు డిస్ట్రిబ్యూటరీ నీటిసంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, రేపూరి ఏసు, గునిశెట్టి రాంజీ, కొండా కిశోర్, ఎన్డీప కూటమి నాయకులు పాల్గొన్నారు.

భాష్యంలో సంక్రాంతి

అమలాపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం భాష్యం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గోదాదేవి కల్యాణం ప్రత్యేకంగా జరిపించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక సెట్టింగులు వేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు. సాకుర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలతో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచి పారిశ్రామిక ఆలోచనలు రేకెత్తించాలి



అమలాపురంలో మైండ్ సెట్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థి దశ నుంచి పారిశ్రామిక ఆలోచనలు రేకెత్తించే విధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మైండ్‌సెట్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం పాఠశాల స్థాయి నోడల్ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పారిశ్రామిక మనస్తత్వాన్ని పెంపొందించడం ద్వారా విద్యార్థులు ఉత్పాదక సామర్థ్యాన్ని పొందుతారన్నారు. ఈఎండీపీ జిల్లా నోడల్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరానికి జిల్లాలో 40ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఈనెల20 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈఎండీపీ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. జోనల్ మేనేజర్ వై.నవ్య, సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, మాస్టర్ ఫెసిలిటేటర్స్ మేకా రామలక్ష్మి, చంద్రావతి, హెచ్ఎం రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు

అమలాపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఐటిక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, హ్యూండాయ్ మొబిస్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, ఐటిక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఎండీ గంటి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు ఎంపికైన అయ్యస్



అమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేరూరు ఐరా పాఠశాల విద్యార్థి పెన్మెత్స రాజా సుభోద్ అయ్యస్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తేజస్విని తెలిపారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన అండర్-12 క్రికెట్ సెలక్షన్స్‌లో ఐస్ ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయ్యస్‌ను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

రీసర్వేతో ప్రయోజనాలు

మలికిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆర్డీవో కె.మాధవి అన్నారు. మట్టపర్రులో రీసర్వే నిమిత్తం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీవో మాధవి మాట్లాడుతూ రీసర్వే ద్వారా గ్రామాల్లో భూముల సరిహద్దులు కచ్చితంగా ఉంటాయన్నారు. భూవివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లికార్జునరావు, మండల సర్వేయర్ మధుసూదనరాజు, సర్పంచ్ కడలి దుర్గాదేవి, వీఆర్వో రమేష్‌పాల్గొన్నారు.

గడియారస్తంభం సెంటర్‌ను సుందరీకరించాలి

అమలాపురంటౌన్, జనవరి9(ఆంధ్రజ్యోతి): అమలాపురం గడియార స్తంభం సెంటర్‌ను వెంటనే శుభ్రంచేసి విద్యుత్ కాంతులతో సుందరీకరణ చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా గడియార స్తంభం సెంటర్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేయడంతో పాటు ఎంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురై అధ్వానస్థితికి చేరుకుందన్నారు. సంక్రాంతినిపురస్కరించుకుని కోనసీమ కేంద్రమైన అమలాపురం పట్టణానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మెచ్చుకునేలా గడియార స్తంభం సెంటర్‌ను సుందరీకరణ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

మామిడికుదురు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆంధ్రప్రదేశ్‌వారి సౌజన్యంతో తయారుచేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాశాఖాధికారి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబులు గురువారం పంపిణీ చేశారు. మండలంలోని 12పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరిమిత సంఖ్యలో స్టడీమెటీరియల్ అందించారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎస్టీయూ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ నిరంజనీ, ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, కార్యదర్శి కేవీ రాఘవరావు, మట్టా నాగరాజు, బత్తుల రమేష్‌బాబు, వడ్లమూడి రాజు, శిరిగినీడి శ్రీరామకృష్ణ, సయ్యద్ రూహీ పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

కాట్రేనికోన, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు హైస్కూల్ పరిధిలోని సాపేవారిపల్లె టెన్త్ విద్యార్థులకు ఎస్టీయూ రూపొందించిన అదే పాఠశాలకు చెందిన హెచ్ఎం ఆర్.రమేష్‌నాయుడు, స్కూల్ అసిస్టెంట్ ఎస్‌బీఎస్ఎన్ మూర్తి ఆర్థిక సహకారంతో స్టడీమెటీరియల్‌ను అందించారు. పీఎంసీ చైర్మన్ కాశి శ్రీనుబాబు విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎస్ఎస్‌సత్యనారాయణ, ప్రసాద్, జేడీ శ్యామల, వి.ఉదయిని, గెడ్డం ప్రదీప్, టి.సుబ్బారావు, ఎస్.సురేష్, బి.సాగర్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యానాంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

యానాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మెట్టకుర్రు హైస్కూల్ క్రీడా మైదానంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆశీస్సులతో యానాం ప్రీమియర్ లీగ్ 2025 క్రికెట్ పోటీలు నిర్వహించారు. యానాం నుంచి 5జట్లు పాల్గొన్నాయి. ప్రముఖ న్యాయవాది కమిటీ విజయర్‌కుమార్, శ్రీవేద పాఠశాల చైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు, ఇండియన్‌బ్యాంక్ మాజీ బ్రాంచ్ మేనేజర్ పోలిమారి సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు చెల్లి గోపినాధ్, శీలం మాస్టర్లు పోటీలను ప్రారంభించారు. తొలిరోజు రమాయూత్, గిరియంపేట మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. దాతలు సహకారంతో ఈటోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు దయా, నాగూర్, సచిన్ తెలిపారు.

పల్లంకుర్రులో సీసీ కెమెరాల ఏర్పాటు

కాట్రేనికోన, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులోని పలు ప్రాంతాల్లో వర్తక సంఘం, గ్రామ పెద్దల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ అవినాష్ తెలిపారు. ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కంచుస్తంభం కృష్ణ, మంతెన సూరిబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన గవర్నర్ పర్యటన

యానాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ పర్యటన ముగిసింది. రెండు రోజుల పర్యటనకు యానాం వచ్చిన ఆయన యానాం ప్రజాఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. గురువారం ఉదయం యానాం నుంచి రోడ్డుమార్గన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లారు. అక్కడ నుంచి పుదుచ్చేరి వెళ్లారు. ఈసందర్భంగా గవర్నర్‌కు విమానాశ్రయం వద్ద ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, అధికారులు వీడ్కోలు పలికారు.

గుర్రపుడెక్క తొలగింపు

రాజోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పొన్నమండ నుంచి గోగన్నమఠం వరకు డ్రెయిన్ పది కిలోమీటర్లు పంటకాల్వలో గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు దిగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని రైతులు గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో గురువారం గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గోపాయిలంక రామాలయంలో హుండీ చోరీ

అల్లవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోడితిప్ప పంచాయతీ పరిధిలో గోపాయిలంక రామాలయంలో బుధవారం రాత్రి హుండీని దొంగలు ఎత్తుకెళ్లి ఏటిగట్టు వద్ద పడవేశారు. ఆరు నెలల క్రితం దొంగతనం జరిగిన రామాలయంలోనే రెండోసారి దొంగతనం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ ఆలయాల హుండీలు, వ్యాపార దుకాణాల్లో వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దొంగలు రెచ్చిపోయి దొంగతనాలకు పాల్పడుతున్నా పోలీసుల చర్యలు లేవని, హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా ముక్కామల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ముక్కామల, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘేశ్వరం, మోడేకుర్రు, చినలంక, చిరతపూడి, పసుపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.





సత్కారాలు

తూర్పుగోదావరి జి రాజానగరం మండలం దివాన్‌చెరువులో ఉన్న గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న తెలుగు మహాసభల్లో గురువారం ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావులను సత్కరించారు.

బోల్తా కొట్టిన ట్రాక్టరు

పి.గన్నవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అమలాపురం రహదారి పోతవరం వద్ద కొబ్బరికాయలు ట్రాక్టరు బోల్తా కొట్టింది. గురువారం నాగుల్లంక నుంచి మూడువేలు కొబ్బరి కాయలతో అయినాలవారిపాలెం వెళ్తున్న ట్రాక్టరు పోతవరం వద్ద రహదారి కుంగిపోవడంతో ట్రక్కు తిరగబడింది. ఈఘటనలో డ్రైవర్, మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం ట్రాక్టర్‌ను పక్కకు తీసి కొబ్బరికాయలను మళ్లీ లోడు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు/అల్లవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. అల్లవరం మండలం బొడసకుర్రు గ్రామానికి చెందిన కొప్పాడి వెంకటేశ్వర్లు(58) తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో పండ్లు, చేపల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం ఉదయం టీవీఎస్ మోపెడ్‌పై గోపాలపురం వెళ్తుండగా కొవ్వూరు మండలం కాపవరం గోవర్ధనగిరిమెట్ట జియో పెట్రోల్ బంకు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

స్లూయిస్ పక్కన మోటారు సైకిల్

ముమ్మిడివరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక-పల్లంకుర్రు ఏటిగట్టు ముమ్మిడివరం మండలం అయినాపురం స్లూయిస్ వద్ద గోదావరి నది పక్కన ఒక మోటారుసైకిల్ (ఏపీ05డీయూ8934) పడి ఉంది. రాత్రివేళలో ఎవరైనా ఈ ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యారా లేదా మరేదైనా కారణమా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మోటారుసైకిల్ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. మోటారుసైకిల్ కోసం సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

ప్రత్యేక శనగల పూజ

అల్లవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పీరుగా పేరొందిన అల్లవరం పీర్ల పంజాలో శనగల పూజలు జరిగాయి. ముజావర్లి షేక్ గౌషియా ఆధ్వర్యంలో కోరికలు నెరవేర్చే శనగల పూజలు నిర్వహించారు. రాజమహేంద్రవరం, మగటపల్లి, అమలాపురం ప్రాంతాలకు చెందిన ముస్లిం మహిళలు పీర్ల పంజాల్లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ పోటీలకు విస్తృత ఏర్పాట్లు

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చురుకుగా చేపడుతోంది. ఆత్రేయపురం లాకుల వద్ద ప్రధాన కాలువలో పడవ, ఈత పోటీలు నిర్వహించనున్నారు. సంక్రాంతి ముందుగా 11, 12, 13 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పోటీల ఏర్పాటు నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఆర్డీవో శ్రీకర్ ఏర్పాట్లను పర్యవేక్షించి సూచనలు చేశారు. తహశీల్దారు రాజేశ్వరరావు పర్యవేక్షణలో వీటి ఏర్పాట్లు చేపడుతున్నారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. గురువారం ప్రధాన కాలువలో ట్రయిల్ రన్ జరిపారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా లొల్ల లాకుల నుంచి ఉచ్చిలి వరకు ట్రాఫిక్‌ను మళ్లించి పోటీలను తిలకించే వారికి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఈ ట్రోఫీకి రావాలని ఆహ్వానాలు పంపారు.


ఆత్రేయపురం ప్రధాన కాలువలో నిర్వహించనున్న పడవ పోటీలకు ట్రయిల్ రన్


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తుల రద్దీతో వెంకన్న ఆలయం కిటకిట

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేద పారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,46,971 వచ్చినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

రైతులకు వరం మినీ గోకులం పథకం


ఆలమూరు మండలంలో నిర్మించిన మినీ గోకులం

ఆలమూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆదాయం తీసుకొచ్చే పాడిని ప్రోత్సహించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా రైతులకు మినీ గోకుల పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా రైతులకు పశువుల షెడ్‌ను నిర్మిస్తారు. షెడ్డుతోపాటు పశువులకు ఉపకరించే సదుపాయాలు కల్పిస్తారు. గోకులం పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతులను ఎంపిక చేసి లబ్ధిదారులను ఎంపిక చేశా రు. వీటి మంజూరు, నిర్మాణం, రైతులకు చెల్లింపులు చేసే బాధ్యతను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి అప్పగించారు. వీరి పర్యవేక్షణలో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మండలంలో ప్రస్తుతం 48 గోకులం పథకం ద్వారా షెడ్లు నిర్మించడానికి మంజూరు కాగా ప్రస్తుతం 20 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని ఆలమూరు మండల ఉపాధి హామీ పథకం ఏపీవో అరుణ కుమారి తెలిపారు. వీటి ప్రారంభోత్సవం 10వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కృత్తివెంటి పేర్రాజు పంతులు సేవలు ప్రశంసనీయం


కృత్తివెంటికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యాదాత కృత్తివెంటి పేర్రాజు పంతులు చిరస్మరణీయుడని వైద్యుడు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాలలో ఆయన విగ్రహానికి స్టాలిన్‌తో పాటు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు విద్యా సంస్థల స్థాపనకు ఆయన పునాది వేశారని కొనియాడారు. ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి కొవ్వూరి తాతారెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కనకాల వెంకటేశ్వరరావు, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కపిలేశ్వరపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వల్లూరు పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ డి.కావేరి, శేఖర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను సన్మానించి వారికి దుస్తులతో పాటు స్వీట్స్, సేఫ్టీ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గుణ్ణం సుబ్బరాజు, గ్రామ కార్యదర్శి కె.సత్తిబాబు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర ఉన్నత పాఠశాలకు దాతలు గురువారం మల్టీ పర్పస్ సౌండ్‌సిస్టం బహూకరించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గొడవర్తి రాంప్రసాద్, వారి సోదరులు సోమసూర్య ప్రకాశరావు, గంగాధర వీరప్రభాకరరావు, వారి సోదరి కరుటూరి జానకరత్నం వారి తల్లిదండ్రులు గొడవర్తి పెదవెంకట్రావు, సుబ్బాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం మల్టీసౌండ్ సిస్టం బహూకరించినట్లు పాఠశాల హెచ్‌ఎం రమాదేవి తెలిపారు. పాఠశాలలో నిర్వహించే అసెంబ్లీ, తదితర కార్యక్రమాలకు దీనిని వినియోగించనున్నట్లు చెప్పారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

సహకార సంఘాల ఉద్యోగులు దశలవారీగా పోరాటం

ద్రాక్షారామ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గురువారం సహకార సంఘాల ఉద్యోగులు దశలవారీ ఉద్యమానికి సిద్ధం అయ్యారు. గురువారం మండలంలో సహకార సంఘాల ఉద్యోగులు పార్లర్ రన్‌తో పాటు కంప్యూటర్ పని నిలుపుదల చేశారు. రాష్ట్ర యూనియన్ కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో టీడీపీ ప్రభుత్వం సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి జీవో జారీ చేసిందన్నారు. తదుపరి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేయకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 10న డిసిసిబి కార్యాలయాల వద్ద ధర్నా, 20న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 27న విజయవాడలో రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద ధర్నా చేస్తామన్నారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు సేవలు శ్లాఘనీయం

ద్రాక్షారామ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ శాసనసభ్యుడు పిల్లి అప్పారావు సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలన్నారు. దివంగత అప్పారావు 38వ వర్ధంతిని రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం, ద్రాక్షారామ, నరసాపురపుపేటలో జరిపారు. వెంకటాయపాలెంలో సచివాలయం వద్ద ఆయన విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి తదితరులు నివాళులర్పించారు. ద్రాక్షారామ, నరసాపురపుపేట గ్రామాల్లో ఆయన విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.రాంబాబు, పి.అప్పారావు తదితరులతో పాటు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో కృత్తివెంటి స్మారక దినోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ): కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గురువారం కృత్తివెంటి పేర్రాజు పంతులు స్మారకదినోత్సవం జరిపారు. యోగా, వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తొగరు మూర్తి, గొల్లపల్లి కృష్ణ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పెంటపాటి అన్నవరం, అంకం శ్రీనివాస్, పామర్తి మధు, బలుసు శ్రీనివాస్ చౌదరి, శాకా వీరన్న, పరసవేది బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మాజీ ఎమ్మెల్యే దివంగత పిల్లి అప్పారావు వర్ధంతిని పామర్రులో గురువారం జరిపారు. మెయిన్ రోడ్డులో ఆయన విగ్రహానికి ఎంపీపీ పంపన నాగమణి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని నివాళులర్పించారు. కార్యక్రమంలో పామర్రు సర్పంచ్ వాసంశెట్టి వెంకట దుర్గ, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, బత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దంగేరు సర్వతోముఖాభివృద్ధికి కృషి

మంత్రి సుభాష్

కె.గంగవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దంగేరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం దంగేరులో మన గ్రామం-మన సుభాష్ కార్యక్రమం సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ అధ్యక్షతన జరిగింది. సభలో మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి గ్రామంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని తెలిపారు. ఇంకా చేయాల్సిన పనులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో చేయాల్సిన పనుల జాబితాతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ దంగేరు గ్రామంలో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం గ్రావెల్ రోడ్లు, సామాజిక భవనాలు, కైలాస భూమి అభివృద్ధి తదితర పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి గ్రామంలో ప్రారంభోత్సవాలకు వస్తానని హామీ ఇచ్చారు. మార్చి నాటికి మూడు పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ. 200తో గుండె వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసే లా రామచంద్ర పురంలోని ఒక ఆసుపత్రిలో సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నాయకులు సలాది రమేష్, రవ్వా భూషణం, సి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దంగేరు సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

కె.గంగవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిపారు. బాలాంత్రంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు నరాల కృష్ణకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు ఆకట్టుకున్నాయి. గంగవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ వేషధారణతో భోగి మంటను వెలిగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలమూరు: ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు వీటిని ప్రారంభించారు. విద్యార్థుల రంగవల్లులు, హరిదాసు కార్యక్రమాలతో పాటు పలు రకాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిపిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినుల సంప్రదాయ వస్త్రాలంకరణ ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా టింబర్స్ డిపో జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి పాల్గొన్నారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి మంట, హరిదాసులు, సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్.అరుణ్‌కుమార్, రమేష్ బాబు, హరిబాబు, రజని, సుమలత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంలోని అక్షర థియేటర్స్‌లో సీఆర్సీ సంక్రాంతి వేమన జయంతి సంబరాల పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు ఆవిష్కరించారు. సీఆర్సీ ఆధ్వర్యంలో 13వ తేదీ నుంచి 18 వరకు జరిగే సంక్రాంతి, వేమన జయంతి సంబరాల ప్రోమోను ఆయన తిలకించారు. కార్యక్రమంలో సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం సంక్రాంతి సంబరాలు జరిపారు. మాచర ఉన్నత పాఠశాల, కపిలేశ్వరపురం శివారు సత్యనారాయణపురం ఆదర్శ పాఠశాలల్లో సంక్రాంతి ఉత్సవాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు జరిపారు. మాచర ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించారు. భోగి మంటలు వేసి సంక్రాంతి వేడుకలను జరిపారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిపారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కోలాటంతో పాటు, భోగి మంటలు వేశారు.

మండపేట: మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నప్పటి నుంచే పిల్లలకు చెప్పాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీర్రెడ్డి అన్నారు. అర్తమూరు సత్యభాస్కర జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండపేట పట్టణం సంఘం కాలనీలో వున్న ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి ముందస్తు వేడుకలు జరిపారు. విద్యార్థులు భోగి మంటలు, గాలిపటాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాలొన్నారు.


రావులపాలెం అక్షర థియేటర్స్ వద్ద సీఆర్సీ సంక్రాంతి సంబరాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

కార్యకర్తలకు అండగా ఉంటా

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): పార్టీ విజయానికి పాటుపడ్డ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని మంత్రి సుభాష్ అన్నారు. గురువారం రాత్రి పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మండల సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్ధేశించిన లక్ష్యం మించి పార్టీ సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. మండలంలో 16 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

మంత్రి పరామర్శ

ద్రాక్షారామ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ శాసనసభ్యుడు నున్న వీర్రాజు మనుమడు నున్న వీర్రాజు కుటుంబీకులను గురువారం మంత్రి సుభాష్ పరామర్శించారు. వీర్రాజు కుమారుడు శ్రీనివాస్ పట్టాభిరామ్, దివంగత మాజీ ఎంపీపీ నున్న రామచంద్రరావు కుమారుడు అభిరామ్‌లను పరామర్శించారు. వీర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట ఒ.లక్ష్మణరావు ఉన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

రావులపాలెం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు అన్నారు. రావులపాలెం ఇందిరాకాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రంధి శేషగిరిరావు, కోట వాసు, ఆర్.కాశీవిశ్వనాథ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉత్తరద్వార దర్శనం ఏర్పాట్లు పూర్తి

మండపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి) కేపీ రోడ్డులోనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనం ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు చేశారు. దాతలు మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, పసలపూడి వెంకటసాయి సూర్యప్రకాష్ గుప్తాల ఆర్థిక సహకారంతో పుష్పాలంకరణ జరుగుతుందని పాలక మండలి సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి హాజరవుతారన్నారు. పట్టణానికి చెందిన ఐఎస్‌డి ఫౌండేషన్ సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కల్పించామని తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కపిలేశ్వరపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చిన్నారావు, అంగర ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి వేడుకలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో మోడరన్ ప్రైమరీ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో లయన్ జీవీ రావు, అకడమిక్ డైరెక్టరు ఎ.రమాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ప్రైమరీ స్కూల్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఎన్ఎస్ఎస్ సేవలు

మోడరన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఇన్ అండ్ అవుట్ పేషంట్‌లకు పండ్లు, వేరుశనగ అచ్చులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జి.మాణిక్యం, ఎ.శ్రీనివాస్, ఎన్.సుధాకర్, స్థానిక జనసేన నాయకులు గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

కపిలేశ్వరపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని కపిలేశ్వరపురం సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంఈవో కె.తాతారావు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో కోనసీమ క్రీడోత్సవంలో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతరం రెండు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ శ్రీనివాస్ సహాయంతో రాష్ట్ర బాస్కెట్‌బాల్ సెక్రటరీ గన్నమనేని చక్రవర్తి సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ కొప్పిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీడీవో రత్నకుమారి

ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయండి

కె.గంగవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఏ.రాజు అన్నారు. గురువారం కె.గంగవరం సచివాయలంలో ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశం జరిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ గౌరీ కుమారి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు 116 మంది ఎంపిక

కె.గంగవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా పామర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా జరిగిన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 550 మంది పాల్గొనగా 116 మంది విజేతలుగా నిలిచి, జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ఏ.నాగరాజు తెలిపారు. విజేతలకు ఎంపీపీ పంపన నాగమణి, కూళ్ల నీటి పంపిణీ సంఘం ఉపాధ్యక్షుడు ఎనుమల గోపాలకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోతో పాటు, ఎంఈవో 2 చోడిశెట్టి ఆంజనేయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం పదిలం

రాయవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆటలు ఆరోగ్యాన్ని, ఉల్లాసాన్ని ఇస్తాయని ఎంపీపీ నౌడు వెంకట రమణ, టీడీపీ సీనియర్ నాయకుడు వుండవిల్లి రాంబాబు అన్నారు. గురువారం కోనసీమ క్రీడోత్సవాలు ముగింపును పురస్కరించుకుని రాయవరం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మూడు రోజులుగా జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, యరమాటి సత్యనారాయణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీకి నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

కె.గంగవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కూళ్ల డీసీ పరిధిలో నీటి సంఘాల అధ్యక్షులు ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేసుకుని రబీ పంటలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కూళ్ల డీసీ అధ్యక్షుడు మేకా శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎనుమల గోపాలకృష్ణ అన్నారు. గురువారం కూళ్ల డీసీ సమావేశం కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో జరిగింది. సమావేశంలో కూళ్ల, యండగండి, మాచర, అంగర నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడారు. అనంతరం ఇరిగేషన్ ఈఈ వీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. కార్యక్రమంలో కోటిపల్లి డీసీ దాట్ల విజయగోపాల్‌రాజ్, నీటి సంఘాల అధ్యక్షులు కె.జానకిరామయ్య, కె.నాగ సూరిబాబు, ఇరిగేషన్ డీఈ రమేష్, డ్రైనేజ్ డీఈ కె. పోచారావు, ఏఈలు సుబ్రమణ్యం, సుబ్బారావు, కృష్ణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న కూళ్ల డీసీ అధ్యక్షుడు శివప్రసాద్

గణతంత్ర వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 26న జరిగే గణతంత్ర వేడుకలకు కొత్తపేట మండలం వాడపాలెం సర్పంచ్ త్సామా ఆదినారాయణ మూర్తికి ఆహ్వానం అందింది. దీనిపై డీపీవో నుంచి సమాచారం అందినట్టు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ గోవిందరావు

ప్రభల ఉత్సవంపై సమీక్ష

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని సంప్రదాయంగా జరుపుకుందామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు పేర్కొన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఉత్సవ కమిటీలతో శాంతి కమిటీ సమావేశం ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. కొత్తపేట ప్రభల ఉత్స వాన్ని ఘనంగా జరుపుకుందామని తెలి పారు. ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం ప్రభల ఉత్సవం జరుపుతామని అధికారులు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో ఉత్సవ కమిటీ నాయకులు దర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులతో పాటు పోలీసు అధి కారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెం డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో సమస్యలు తెలుసుకుని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ డీఎం జీజీవీ రమణ అన్నారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో పలు సమస్యలపై వచ్చిన సూచనల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పిరమిడ్ స్పిరిట్యుయల్ సొసైటీ అధ్యక్షుడిగా నల్లమిల్లి

మండపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమ జిల్లా పిరమిడ్ స్పిరిట్యుయల్ సొసైటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నల్లమిలి విజయ భాస్కరరెడ్డి నియమితులయ్యారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో వున్న కొనగళ్ల సత్యనారాయణ పిరమిడ్ ధ్యాన మందిరంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి పిరమిడ్ కేంద్రంలో సభ జరిగింది. వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పిరమిడ్ కేంద్రం పేరవరంలో నిర్మించటం అదృష్టమన్నారు. జిల్లా అధ్యక్షుడిగా గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. తనను ఎన్నుకున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్స్, బోనగిరి సత్యసుధ, పులగం లక్ష్మీవానపల్లి నాగేశ్వరరావు, వల్లూరి వీరవెంకట సత్యన్నారాయణ చౌదరి, గొల్లవిల్లి నాని, వానపల్లిపాలెం గురువు రుషేంద్ర, 80 మంది ధ్యానులు తదితరులు హాజరయ్యారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు జొన్నాడ యువకుడు


ఎంపికైన కాశ్యప్

ఆలమూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అండర్-17 జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఆలమూరు మండలం జొన్నాడ యువకుడు పెద్దింటి నరసింహకాశ్యప్ ఎంపికయ్యాడు. ఇటీవల మంగళగిరిలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 పోటీల్లో జట్టు కెప్టెన్‌గా కాశ్యప్ పాల్గొన్నాడు. అక్కడ జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఆయన్ను జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపాలెంలో గురువారం ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 10 లీటర్ల సారాతో అన్నే రాజేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధి ంచినట్టు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.


మూసుకుపోయిన పంటకాలువను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

సాగునీటి కష్టాల తొలగింపు

ఆలమూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పంట భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మూసుకుపోయిన పంటకాలువను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి సాగునీటి ఇబ్బందులు పరిష్కరించారు. జొన్నాడ మెయిన్ కాలువ నుంచి ఆలమూరు వచ్చే పంట కాలువ ఇటీవల పూర్తిగా మూసుకుపోయింది. దీంతో దిగువ ప్రాంతాల భూములకు సాగునీరు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌కు తెలపడంతో ఆయన స్పందించారు. గురువారం పంట కాలువను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేసే చర్యలు చేపట్టారు. సాగునీరు సక్రమంగా చేరేలా చర్యలు చేపట్టిన సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌ను రైతులు అభినందించారు.